# రాఖీ పండుగ ఎఫెక్ట్!

## నగరంలో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ సిటీ దాటేందుకు 2 గంటలపైనే..





**హైదరాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** రహదారులన్నీ ట్రాఫిక్ చక్రబంధంలో ఇరుక్కుపోయాయి. నగరంతో పాటు నాలుగు వైపులా వేలాది వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. నగరం నుంచి వెళ్లే రూట్లు.. ఎటు చూసినా చీమల బారులు తీరినట్లుగా వాహనాల రద్దీతో హైవేలన్నీ నిండిపోయాయి. రాఖీ పౌర్ణమి పండగను స్వగ్రామాల్లో కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకునేందుకు నగర వాసులు పెద్ద ఎత్తున బయలుదేరడంతో హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. పండగ రద్దీ కారణంగా శనివారం ఉదయం నుంచే రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ శివార్లలోని వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, ఉప్పల్, బోడుప్పల్ తదితర ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత తీవ్రంగా మారింది. ఒక్కసారిగా వేల సంఖ్యలో వాహనాలు రోడ్లపైకి రావడంతో ప్రధాన రహదారితో పాటు సర్వీసు రోడ్లు కూడా పూర్తిగా నిండిపోయాయి. ఫలితంగా, కిలోమీటర్ల కొద్దీ వాహనాలు బారులుగా నిలిచి, ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతున్న పరిస్థితి నెలకొంది. ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద కూడా ఇదే తరహా పరిస్థితి ఏర్పడింది. పండగ రద్దీ కారణంగా ఇక్కడ ట్రాఫిక్ దాదాపు పూర్తిగా స్తంభించిపోయింది. వాహనాలు ముందుకు కదలలేని పరిస్థితి ఏర్పడటంతో ప్రయాణికులు గంటల తరబడి రోడ్లపై ఇరుక్కుపోయారు. ఈ ఊహించని ట్రాఫిక్ జామ్‌తో గమ్యస్థానాలకు సమయానికి చేరుకోలేకపోతున్నామని, ఇంతటి రద్దీని అంచనా వేయలేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగ సీజన్లో ట్రాఫిక్ నియంత్రణకు మరిన్ని చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. మరోవైపు ఉప్పల్, అన్నోజిగూడ నుంచి ఘట్‌కేసర్ వరకు భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. అన్నోజిగూడ నుంచి ఘట్‌కేసర్ వెళ్లేందుకు సుమారు 50 నిమిషాల వరకు పట్టింది.

**ప్రయాణికులతో కిక్కిరిసిపోయిన జేబీఎస్..**

సికింద్రాబాద్ జూబ్లీ బస్ స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. బస్సులు మాత్రం జీరో. ప్రయాణికులకు సరిపడ బస్సులు లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదో ఒక బస్సు వస్తే దాంట్లో సీట్ల కోసం ప్రయాణికులు పాట్లు పడ్డారు. చంటి పిల్లలను కిటికీల్లో నుంచి లోపలికి తోసేసి.. సీట్లల్లో కర్చీప్ వేస్తున్నారు. రాఖీ పండుగ, ఆదివారం రావడంతో.. చాలా మంది తమ సొంతూర్లకు వెళ్లేందుకు బస్టాండ్లకు ప్రయాణికులు భారీగా చేరుకుంటున్నారు. దీంతో జూబ్లీ బస్ స్టేషన్ జనంతో కిక్కిరిసి పోయింది. చంటి పిల్లలను ఎత్తుకొని బస్సుల కోసం ప్లాట్ ఫామ్‌పై గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రెండు గంటలకు ఒక బస్సు రావడంతో ఆ బస్సు ఎక్కడానికి పోటీ పడుతున్నారు. చంటి పిల్లలను చిన్నారులను కిటికీలో నుండి బస్సు లోపలికి పంపిస్తున్నారు. డ్రైవర్ సీట్ పక్కన ఉండే ఇంజిన్‌పై కూర్చొని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి వచ్చింది అని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్ తదితర జిల్లాలకు వెళ్లేందుకు గంటల తరబడి జనం నిరీక్షించారు.

**ఆర్టీసి ప్రత్యేక బస్సులు.. చార్జీలలో మార్పులు!**

రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా ఆర్టీసి ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది మాదిరిగానే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది. అయితే రాఖీ పండుగకు నడిచే బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ఈ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. కాగా, ప్రత్యేక బస్సుల్లో మాత్రమే టికెట్ ధరలను సవరించింది. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉన్నాయి. ఈనెల 11వ తేదీ వరకు నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఈ సవరణ చార్జీలు వర్తిస్తాయని అధికారులు పేర్కొన్నారు. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ప్లే బోర్డులను ఏర్పాటు చేశారు.




హైదరాబాద్ వార్త


## సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో రాఖీ వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి శనివారం పలువురు కాంగ్రెస్ నాయకురాళ్లు రాఖీ కట్టారు. ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ రక్షాబంధన్ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టి, ఆయన ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీ మాట్లాడుతూ మహిళ సాధికారతనే తన ధ్యేయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారని పేర్కొన్నారు. మహిళలను గుర్తించి వారికి అవకాశాలని కలిపించే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని చెప్పారు. ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాఖీ కడుతున్న శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, చిత్రంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు తదితరులు

## పబ్‌లు ఎంతవరకు సేఫ్..?

- -అడ్డగోలుగా ఇంటీరియర్ డిజైనింగ్..డిజేల ఏర్పాటు
- -పరిమితికి మించి శబ్దకాలుష్యం .. స్థానికులకు ఆటంకం
- -అనుకోని సంఘటనలు జరిగినప్పుడు నోటీసులు జారీ
- -ఆతర్వాత చూసిచూడనట్లగా పోలీస్, ఎక్సైజ్ అధికారుల తీరు
- -అత్యధిక పబ్బుల్లో భద్రతా ప్రమాణాలు అంతంత మాత్రమే
- -నిర్వాహకులకు రాజకీయ అండదండలు ఉండటమే కారణం

**హైదరాబాద్, ఆగస్టు 9 ,ప్రభాతవార్త:** హైదరాబాద్ పబ్‌లలో పరిస్థితి ఏంటీ ? ఇదే విషయాన్ని అగ్నిమాపక విభాగం..పోలీస్ అధికారులను అడిగితే ..ఇప్పటివరకు పబ్‌లో భద్రత ఉందా అన్నకోణంలో తనిఖీలు చేయలేదనే సమాధానం వినిపిస్తుంది. వందలామదంది యువతీయువకులు నిత్యం పబ్‌లకు వస్తూ వేడుకలు జరపుకుంటారు. అయితే ఇక్కడి పబ్‌లలో ప్రాణాలకు రక్షణ ఉందా..? అనుకుకోని ప్రమాదం జరిగితే సురక్షితంగా బయటపడగలమా.. మద్యం మత్తులో ఉండే వారిని నిర్వాహకులు జాగ్రత్తగా బయటకు పంపగలా ..అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే బహుళ అంతస్తులు నిర్మిస్తున్న యజమానులు ఎలాంటి భద్రతా నిబంధనలు పాటించకుండానే పబ్బులు, హోటళ్లు, ఆసుపత్రులు, బార్‌అండ్ రెస్టారెంట్లకు అద్దెకు ఇస్తున్నారు. మూడు కమిషనరేట్ల పరిధిలో 600లకుపైకుపైగా బార్ అండ్ రెస్టారెంట్లు ఉండగా ..వాటిలో సుమారు 130వరకు పబ్‌లుగా మార్చేశారు. వీటిలో నిర్వాహకులు బహుల అంతస్తుల్లోని 3,4ఫ్లోర్‌లలో నిర్వహిస్తుంటారు. వీటిలో 80శాతంపైగా భవనాలకు ఎలాంటి ఫైర్ అనుమతులు లేకుండానే నిర్వహిస్తున్నారు.

**కళ్లు జిగేల్‌మనే లైటింగ్..**

నిత్యం వేలమంది యువతీ, యువకులు పబ్‌కు వస్తుంటారు. నిర్వాహకులు కస్టమర్లను చిన్నద్వారం గుండా లోపలికి పంపిస్తారు. లోపలక అంతా ఒకగుహాలా ఉంటుంది. పబ్‌లలో కళ్లు జిగేల్ మనిపించే లైటింగ్‌లకు ప్రాధాన్యం ఇస్తారు. డై డిస్కో, కలర్ లైటింగ్ వంటి వ్యవస్థలను పబ్‌లలో అమరుస్తుంటారు. ఈవెలుగుల్లో కుర్రకారు నృత్యాలు చేస్తూ హంగామా చేస్తుంటారు. అయితే ఈలైటింగ్‌ల నుంచి అతిప్రమాదకరమైన వేడి వస్తుంటుంది. ఈవేడి పార్టీ ప్రియులమీద ప్రభావం చూపించకుండా నిర్వాహకులు సెంట్రల్ ఏసీ సిస్టమ్‌ను అమరుస్తారు. అయితే ప్రతినాలుగు నెలలకోసారి ఒక్కడ వాడే వైరింగ్ మార్చాల్సి ఉంటుంది. కానీ నిర్వాహకులు కక్కుర్తి కొద్ది పాత వైర్లనే జాయింట్‌లు చేసి నడిపిస్తుంటారు. ఇక్కడ ఏర్పడే షార్ట్ సర్క్యూట్ అగ్ని ప్రమాదాలకు దారి తీస్తుంది. గతంలో ముంబైలో జరిగిన ఓ దుర్ఘటకు ఇదే కారణమని పోలీసులు విచారణలో తేల్చారు.



**హోరెత్తించే సంగీతం..**

హోరెత్తించే సంగీతమే పార్టీలలో కీలకం. వేల వాట్ల సంగీతం బయటివారికి వినిపించకుండా పబ్ నిర్వాహకులు సౌండ్‌ప్రూఫ్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. లేదంటే సిటీపోలీస్‌యాక్ట్ ప్రకారం నేరం అవుతుంది. లోపలి సంగీతం బయటకు వినిపించకుండా ఉండేందుకు శాశ్వత నిర్మాణాలు చేపట్టాల్సి వస్తుంది. ఖర్చుతో పాటు ఇంటీరియర్ డిజైన్‌ల ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన నిర్వాహకులు తాత్కాలిక ప్రాతిపదికన సౌండ్‌ప్రూఫ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. కార్డ్‌బోర్డు, రెక్సిన్, స్పాంజ్‌లతో కూడిన సౌండ్ ప్రూఫ్ ఏర్పాట్లను చేస్తున్నారు. అయినప్పటికీ కొన్నిపబ్‌లలో అవికూడా ఏర్పాటు చేయకుండా నిర్వహిస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

**భద్రతా ప్రమాణాలు పాటించాలి..**

బార్‌లు, పబ్‌లు, రెస్టారెంట్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతాపరమైన చర్యలు పాటించాలని ముఖ్యంగా ఫైర్‌సేఫ్టీ పద్దతులు పాటించాలని అగ్నిమాపకశాఖ అధికారులు అంటున్నారు. నిబంధనల ప్రకారం పబ్బులు నిర్వహిస్తున్న భవనానికి ఖచ్చితంగా ఫైర్ అనుమతులు ఉండాలి. వందలాందిమంది వచ్చే ప్రాంతం కావడంతో నిర్వాహకులు రెండు పెద్దపెద్ద సేఫ్టీ డోర్‌లను ఏర్పాటు చేసుకోవాలి. ఫైర్ ఎగ్జిట్ సిస్టమ్ ఉండాలి, ఫైర్ అలారమ్స్ ఏర్పాటు చేయడంతోపాటు ప్రమాదం జరిగిన వెంటనే తెరుచుకుని మంటలు అర్పే విధంగా స్పింకర్లను అమర్చుకోవాలి. అలాగే పెద్దపెద్ద ఈవెంట్లు జరిగేటప్పుడు నిర్వాహకులు ఎక్కువ మంది సహాయకులను నియమించుకుని వేడుకలు జరుగుతున్న ప్రాంతంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి.

**చర్యలకు ముందుకు రాని అధికారులు...**

పబ్‌ల అడ్డగోలు బాగోతంపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏమాత్రం ముందుకు రావడంలేదు. కేవలం మీడియాలో వచ్చిన కథనాలతో పాటు ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్న సమయంలో మాత్రమే తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కేవలం నోటీసులు ఇవ్వడం ఆతర్వాత చూసిచూడనట్లుగా వ్యవహరించడం పరిపాటిగా మారింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 15రోజుల నుండి మొదలు ఆరు నెలల వరకు పబ్‌ల లైసెన్స్ రద్దుచేసే ఆబ్కారీ అధికారులకు ఉంటుంది. కానీ అందికారులు ముందుకురావడం లేదు. దానికి కారణం పబ్‌లపై చర్యలు తీసుకునే సదరు అధికారులపై రాజకీయ నేతల ఒత్తిడి ఉండటమే కారణం అని తెలుస్తుంది.



## నిండు కుండలా హుస్సేన్‌సాగర్

### -లోతట్టు ప్రాంతాలను అప్రమత్తం చేసిన అధికారులు

**హైదరాబాద్, ఆగస్టు 9,ప్రభాతవార్త:** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు హుస్సేన్ సాగర్ చేరుకోవడంతో తూము గేట్లు ఎత్తి నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. అలాగే లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ట్యాంక్ బండ్‌కు భారీగా చేరుతున్న వరద నీరుతో హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్‌లా తయారయ్యింది. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 514.75 మీటర్లు. ప్రస్తుతం హుస్సేన్ సాగర్ నీటిమట్టం 513.53 మీటర్లుగా ఉంది.




దీంతో అధికారులు హుస్సేన్ సాగర్ వరదనీటిని వాటర్ లెవెల్ దాటకుండా మెయింటైన్ చేస్తున్నారు. గరిష్ఠ స్థాయికి నీటిమట్టం చేరుకోవడంతో నాలుగు తూమ్‌ల నుంచి నీటిని బయటకు విడుదల చేస్తున్నారు. ముఖ్యంగా ఎగువ ప్రాంతాలైన బంజారా, పికెట్, కూకట్ పల్లి, బుల్కాపూర్ నాళాల నుంచి హుస్సేన్ సాగర్ లోకి వరద నీరు ప్రవహిస్తుంది. దీంతో దిగువ ఉన్నటువంటి లోయర్‌టాంక్‌బండ్, అశోక్‌నగర్ తదదితర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తంగా చేశారు.

## రాష్ట్ర దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల సాధనకు ప్రాముఖ్యం

### - ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్

**నాంపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త :** భారతదేశం, తెలంగాణ రాష్ట్రాల దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి ఆవిస్కర్తలు, సరికొత్త ఆలోచనలతో ముందుకువచ్చే వారి ప్రాముఖ్యత ఎంతో ఉందని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. ఏడు సంవత్సరాల విరామం తర్వాత భారతదేశంలో స్టార్టప్‌లు, సృష్టికర్తలు, ఆవిష్కర్తల అతిపెద్ద వేడుకైన ఆగస్టు ఫెస్ట్ హైదరాబాద్‌లో గొప్పగా పురామగమనం జరిగిందన్నారు. మొదట వ్యవస్థాపకతపై మొదలైన ఈ ఉత్సవం ఇప్పుడు సాంకేతికతపై దృష్టి సారించిందని, 2035 నాటికి రాష్ట్ర జిడిపి ఒక ట్రిలియన్ డాలర్తకు, 2047 నాటికి భారతదేశం 3ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలనే, జాతీయ జిడిపికి దాని సహకారాన్ని 5నుండి 10శాతానికి పెంచడం లక్ష్యంగా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ పాలసీ ఆకాంక్షకు అనుగుణంగా జయేష్ రంజన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక డైరెక్టర్ జె.ఎ.చౌదరి, సంగీత స్వరకర్త రమణ గోగుల, ఆగస్టు ఫెస్ట్ వ్యవస్థాపకుడు కిరణ్ మావెరిక్ తదితర ప్రముఖులతో కలిసి ఈ ఉత్సవాన్ని లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. ఆగస్టు ఫెస్ట్ వంటి వేదికలు రాష్ట్ర, దేశ సాంకేతికత ఆధారిత వృద్ధి, భవిష్యత్తును రూపొందించడంలో కీలకమైనవని స్పష్టం చేశారు. రమణ గోగుల, ప్రపంచ సాంకేతక దృశ్యాన్ని ప్రతిబింబిస్తూ కృత్రిమమేథా యొక్క పెరుగుతున్న ప్రభావం గురించి వివరించారు. గూగుల్. మెటా, అమెసాన్, మైక్రోసాఫ్ట్ వంటి సాంకేతిక దిగ్గజాలు ఈ సంవత్సరం కృత్రిమమేథా డేటా సెంటర్లను నిర్మించడంలో సమిష్టిగా 350 బిలియన్ డాలర్లకుపైగా పెట్టుబడి పెడుతున్నాయని గుర్తుచేశారు. హైదరాబాద్ స్టార్టప్ ఎకోసిస్టమ్ అనేక కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ టెక్‌క్లంచ్, ఎండబ్ల్యుసి, వెబ్‌సమ్మిట్‌లాంటి పెద్దయెత్తున గ్లోబల్ ప్లాట్‌ఫామ్ అవసరముందని ఫెస్టివల్ వ్యవస్థాపకులు కిరణ్ మావెరిక్ పేర్కొన్నారు. ఆగస్టు ఫెస్ట్ హైదరాబాద్‌ను అయిదు గ్లోబల్ స్టార్టప్ హబ్‌లలో ఒకటిగా ఉంచడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. ఈ ఫెస్ట్‌లో పలువురు ఔత్సాహికుల నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఈ ఉత్సవంలో బహుళ దశలు, హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్‌లు, స్టార్టప్‌లు, సృజనాత్మక ఇన్‌స్టాలేషన్‌లు చోటుచేసుకున్నాయి. వ్యవస్థాపకులు, టెక్ ఔత్సాహికులు కనెక్ట్ అవ్వడానికి, నేర్చుకోవడానికి, అభివృద్ధి చెందడానికి ఈ సమగ్ర వేదికను అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తజిక్ టిజిఐసి (తెలంగాణ ఇన్నోవేషన్ సెంటర్) ద్వారా తెలంగాణ ఆహార, అనుభవ పర్యాటక యాక్సిలరేటర్‌ను జయేష్ రంజన్ ప్రారంభించారు.




తెలంగాణ ఆహార, పర్యాటక యాక్సిలరేటర్‌ను ప్రారంభిస్తున్న జయేష్‌రంజన్, మెరాజ్‌ఫహీమ్, సోహెల్‌ఖాన్ తదితర ప్రముఖులు

## నాలుగేళ్ల తమ్ముడికి ప్రాణం పోసిన అక్క..

### ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ్ముడికీ రాఖీ కట్టిన అక్క



ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ్ముడికీ రాఖీ కట్టి ధైర్యం చెప్పిన అక్క

**హైదరాబాద్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** రాఖీ కట్టి ధైర్యం చెప్పడం ఒకటి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న తమ్ముడి ప్రాణం కాపాడడం మరొకటి. ఆ రెండవది చేయాలంటే అసాధారణ ధైర్యం కావాలి. మానవ సంబంధాలు క్రమంగా క్షీణిస్తున్న ఈ రోజుల్లో, ఒక అక్క తన తమ్ముడి కోసం ప్రాణాలకే సవాలు విసిరింది. మహబూబ్‌నగర్‌కు చెందిన ఐదేళ్ల బాలుడికి తీవ్రమైన అప్లాస్టిక్ అనీమియా అంటే ఎముక మజ్జ లోపంగా నిర్ధారణ అయ్యింది. ఇంటర్ చదువుతున్న అక్క తమ్ముడికి ధైర్యం చెప్పి, తన శరీరంలోని మూలకణాలను దానం చేసి అతని ప్రాణాన్ని రక్షించింది. రాఖీ పండుగ రోజున సికింద్రాబాద్ కిమ్స్ హాస్పిటల్‌లో తమ్ముడికి రాఖీ కట్టి, 'నీ కోసం నేను ఉన్నాను తమ్ముడు" అని ప్రేమగా చెప్పింది. ఈ సందర్భంగా డా.నరేందర్‌కుమార్ తోట మాట్లాడుతూ, ఇది అక్కా-తమ్ముళ్ల అనుబంధానికి నిజమైన నిదర్శనం అని, అపోహాలను పక్కన పెట్టి ధైర్యంగా తమ్ముడి ప్రాణం కాపాడిందని అన్నారు.

## వదలని వర్షం...తప్పని తిప్పలు



**హైదరాబాద్,ఆగస్టు 9,ప్రభాతవార్త:** ప్రజలను వరుణుడు వదలడం లేదు. శనివారం రాఖీపౌర్ణమిరోజు ఉదయం నుంచి ఎండున్నప్పటికీ సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఎల్బీనగర్, హయత్‌నగర్, అబ్దుల్లాపుర్‌మెట్ తదితర ప్రాంతాల్లో మొదలై తర్వాత నగరంతా విస్తరించింది. పలు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వర్షం పడింది. వనస్థలిపురం, భాగ్యలత, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట ప్రాంతాల్లో వర్షపు జల్లులతో రాఖీలు కట్టేందుకు వెళ్లిన పలువురు మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రోడ్లపై వర్షపు నీరు చేరడంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది. మరోవైపు రాఖీ పండుగ సందర్భంగా ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. వేలాది వాహనాలతో రోడ్లు కిక్కిరిసిపోయాయి. భారీ వర్షాల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి రెండు రోజుల క్రితమే ఆదేశించారు. వర్షాలు కురుస్తాయనే సమాచారం దృష్ట్యా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కలెక్టర్లు జిల్లాల్లోని అన్ని విభాగాలతో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైడ్రా, జీహెచ్‌ఎంసీ విభాగాల అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆయన సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలను చేపట్టాలన్నారు.

## పాతబస్తీ అభివృద్ధి కోసం పాటు పడుతున్న ప్రభుత్వం : బోయ నరేష్

**చార్మినార్,ఆగస్టు 9 ప్రభాతవార్త :**
పాతబస్తీ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్ అన్నారు. ఉప్పుగూడ డివిజన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్ కాలనీలో 16 లక్షల రూపాయల వ్యయంతో నూ తనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కాంగ్రెస్ ప్రభుత్వం పాతబస్తీ అభివృద్ధి కోసం పాటు పడుతు న్న దని, పాతనగరంలో మెట్రో రైలు ప్రాజెక్టు పనులు చురు కుగా జరుగుతు న్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## నిష్కళంక ప్రజా సేవకుడు రాగం నాగేందర్

### : పిఎసి ఛైర్మన్ అరికెపూడి గాంధీ



కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, తదితరులు

**శేరిలింగంపల్లి, అగష్టు 9 ప్రభాతవార్త**
నిష్కళంక ప్రజాసేవకుడిగా మూడుదశాబ్ధాలుగా ప్రజలకు సేవలందిస్తున్న శేరిలింగంపల్లి డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ఆయురారోగ్యాలతో శోభిల్లాలని పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్‌లోని తుల్జాభవాని అమ్మవారి దేవాలయం, హుడా ట్రేడ్ సెంటర్ రామాలయంలో రాష్ట్ర యువజన నాయకుడు రాగం అనిరుద్ యాదవ్, అభిషేక్ యాదవ్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ జన్మదిన్నాన్ని పురస్కరించుకుని పేదలకు, వృద్దులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా హాజరైన పీఏసీ ఛైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడుతూ.. నిరంతరం ప్రజాసేవ చేస్తూ శేరిలింగంపల్లి డివిజన్ ప్రజల గుండెల్లో నిలిచిపోయిన కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నతశిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, మెట్టుకుకుమార్ యాదవ్; మంజుల రఘునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్‌నాయకులు మిరియాల రాఘవరావు, వీరేశం గౌడ్, చింతకింది రవీందర్ గౌడ్, రవియాదవ్; లక్ష్మణ్‌యాదవ్;సయ్యద్ నయిమ్, గప్పర్, శ్రీకాంత్, భేరి రామచందర్ యాదవ్, బద్దం కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ప్రేమ బంధానికి చిహ్నం రక్షాబంధన్

### - సిఐకి రాఖీ కట్టిన మహిళా పోలీసులు




**అత్తాపూర్ ఆగస్టు9,ప్రభాతవార్త :**
అన్నాచెల్లెళ్లు,అక్కాతమ్ముళ్ల ప్రేమ బంధానికి చిహ్నం రక్షాబంధనం అన్ని అత్తాపూర్ సిఐ నాగేశ్వర్ రావు పేర్కొన్నారు. శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక వేడుకలు జరిగాయి. స్టేషన్‌లోని మహిళా కానిస్టేబు ల్స్ తమ సోదరుల మాదిరిగా భావించి స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావుకి రాఖీ కట్టారు. ఈ కార్యక్రమం ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రాఖీ కట్టిన మహిళా పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడు తూ..."పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ ఒక కుటుంబంలా కలిసిమెలిసి ఉండాలి. మహిళా పోలీసులు చూపిస్తున్న ఈ ప్రేమ, గౌరవం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. మనందరం కలిసి ప్రజల కు మరింత మెరుగైన సేవలు అందిద్దాం" అని అన్నారు.

## హెల్మెట్ లేని ద్విచక్ర వాహనదారులకు రాఖీలు

### వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన బాలాపూర్ మహిళా పోలీసులు



హెల్మెట్ లేని ద్విచక్రవాహనదారునికి భార్య పిల్లల సమక్షంలోనే రాఖీ కడుతున్న మహిళా పోలీసు

**సరూర్‌నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** హెల్మెట్లు లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారికి రక్షాబంధన్ రోజు మహిళా పోలీసులు రాఖీలు కట్టారు. ఈ వినూత్న కార్యక్రమానికి రాచకొండ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని బాలాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన మహిళా పోలీసులు శ్రీకారం చుట్టారు. వివరాల్లోకి వెళ్తే.. రాఖీ పౌర్ణమి సందర్భంగా బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు రహదారులపై హెల్మెట్లు లేకుండా ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారిని ఆపి వారికి ఆప్యాయంగా రాఖీలు కట్టి హెల్మెట్లు విధిగా ధరించి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని సూచించారు. రక్షా బంధన్ రోజు కుటుంబ సభ్యులతో కలిసి హెల్మెట్లు లేకుండా వెళ్తున్న వారిని ప్రత్యేకంగా గుర్తించిన మహిళా పిసిలు వారి భార్యల సమక్షంలోనే రాఖీలు కట్టడం విశేషం. ఈ కార్యక్రమంలో బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్, ఎస్ఐ సుధాకర్‌తో పాటు పలువురు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా షాకీర్ అలీ

**చార్మినార్,ఆగష్టు 9 ప్రభాతవార్త :**
హైదరాబాద్ పాతబస్తీలో అత్యంత కీలకమైన బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా యండి షాకీర్ అలీ నియమితులయ్యారు. 2009వ సంవత్సరం బ్యాచ్‌కు చెందిన యండి షాకీర్ అలీ కాలాఫత్తర్ ఎస్ఐగా, రెయిన్ బజార్, చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ల డిఐగా, బండ్లగూడపోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేశారు. నగరంలోని మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ నుంచి బహదూర్‌పుర పోలీస్ స్టేషన్‌కు యండి షాకీర్ అలీ బదిలీపై వచ్చారు. బహదూర్‌పుర ఇన్‌స్పెక్టర్‌గా యండి షాకీర్ అలీ పదవీ బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇక్కడ సిఐగా విధులు నిర్వహించిన ఎం.ప్రవీణ్ కుమార్ పిసిఆర్‌కు బదిలీ అయ్యారు.



భజరంగ్ సేనాఅధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్ రావు గుప్తకు రాఖీ కడుతున్న దృశ్యం




కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్‌కు రాఖీ కట్టిన ఆడపడుచులు



జంపన ప్రతాప్‌కు రాఖీలు కడుతున్న దృశ్యం



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు రాఖి కడుతున్న మాజీ మేయర్ బండ కార్తిక రెడ్డి




బిజెపి రాష్ట్ర మైనారిటీ మోర్చ నాయకుడు మొహమ్మద్ మహమూద్‌కు రాఖీ కడుతున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్



రామ్‌నగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డికి రాఖీ కడుతున్న అక్కాచెల్లెలు టి.శైలజారెడ్డి, నాయిని శిల్పారెడ్డి



శనివారం బ్రహ్మకుమారిస్ చిక్కడపల్లి శాఖ ప్రతినిధి జయశ్రీ ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేష్ లకు రాఖీ కట్టిన దృశ్యం



రక్షా బంధన్ కడుతున్న దృశ్యం

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ



రాఖీ పౌర్ణమి సందర్భంగా కార్మిక నాయకుడు చింతల నాగరాజు నివాసంలో వాళ్ళ సిస్టర్స్ భవానీదేవి ఉమాదేవి నాగరాజుకి రాఖీ కట్టి ఆశీర్వదించడం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు కుత్బుల్లాపూర్ అక్కచెల్లెళ్ల అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. జీడిమెట్ల, ఆగస్టు 9, ప్రభాతవార్త

**గోషామహల్ పరిధిలో..**
**అఫ్జల్‌గంజ్,ఆగస్టు 9 ప్రభాతవార్త:** రాఖీపౌర్ణమి పండుగను పురస్కరించుకుని వివిధ పార్టీలకు చెందిన నాయకులు గోషామహల్ నియోజకవర్గ ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ ద్వారా అన్నా చెల్లెళ్ల అనుబంధాన్ని పెంపొందిస్తుందన్నారు. తెలంగాణ భజరంగ్ సేనా అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్తకు రాఖీ కట్టారు. ఈకార్యక్రమంలో పలువురు లక్ష్మన్‌రావు, భరత్, ధనుష్‌లకు వాణిశ్రీ, అనురాధ, సమత్ర, ఆర్యాధలు రాఖీలు కట్టారు.

**హిందీనగర్ కమ్యూనిటిహాల్‌లో**
**గన్‌ఫౌ ండ్రి,ఆగస్టు 9 ప్రభాతవార్త:** ప్రపంచంలోనే ఈ పండుగ కు ఎంతో ప్రత్యేకత విశిష్టత ఉందని కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ పేర్కొన్నారు. అన్నాచెల్లెల బందాన్ని దాని పవిత్రతను తెలియజేస్తూ ఈ పండుగను ప్రతి సంవత్సరం శ్రావణ మాసం పౌర్ణమి రోజు జరుపు కొవడం గొప్ప విషయమన్నా రు. హిందీనగర్ కమ్యూనిటిహాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో పలువురు బిజెపి మహిళా నాయకురాలు కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్‌కు రాఖీ కట్టారు. ఈపందర్భంగా ఆయన మాట్లా డుతూ ఇంటి ఆడపడుచు శక్తి స్వరూపణి, సాక్షాత్తూ మహాలక్ష్మి ప్రతిరూపం, అంతటిశక్తి గల సోదరి చేత రాఖీ కట్టించుకుంటే అరిష్టాలన్ని తొలగి దేవతలందరి అనుగ్రహం కలుగుతుందన్నారు. మహిళా నుంచి ఆశీర్వాదం తీసుకుని మిఠాయి అందచేశారు. ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు రఘు, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**జంపన ప్రతాప్ నివాసంలో**
**కంటోన్మెంట్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** రాఖీ పండగ తో అన్న దమ్ములు అక్కాచెల్లెళ్ల మధ్య అనుబంధాలు. ప్రేమానురాగాలు మరింత పెరుగుతాయని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్య క్షులు జంపన ప్రతాప్ అన్నారు. న్యూ బోయినపల్లి, న్యూసి టీ కాలని లోని జంపనప్రతాప్ నివాసంలో రాఖీ పండుగ ఘ నంగా జరిగింది. .జంపన ప్రతాప్ జంపన రవి లకు ఆయ న సోదరీమణులు ఇరువురు సరోజ, సక్కుబాయి రాఖీ లు కట్టి స్వీట్స్ తినిపించి ఆయురారోగ్యాలతో అష్టఐశ్వర్యాలతో ఉండాలని దీవించారు. అదేవిధంగా కంటోన్మెంట్ కు చెందిన రిసోర్స్ పర్సన్స్ ( ఆర్పి )లు సందడి చేసారు. జంపనప్ర తాప్.. రాఖీ లు కట్టి స్వీట్లు తినిపించి వాళ్ళ ప్రేమ అనురాగా న్ని చాటుకున్నారు. సదా.. ఆర్పి లకు తోడుగా ఉంటానని జంపన.ప్రతాప్ హామీచ్చారు. .ఈ కార్యక్రమం లో అర్పి లు ఆదిలక్ష్మి. మంజుల. శైలజ తదితరులు పాల్గొన్నారు.

**రాంచందర్ రావుకు రాఖి కట్టిన కార్తిక రెడ్డి**
**తార్నాక, ఆగస్టు 9 ప్రభాతవార్త :** సోదర భావానికి ప్రతీక అయిన రక్ష బంధన్ రాఖీ పౌర్ణమి వేడుకలను పురష్కరించుకొని మాజీ మేయర్ బండ కార్తిక చంద్రా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావుకు తార్నాకలోని వారి నివాసంలో రాఖి కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**గాంధీనగర్ డివిజన్‌లో...**
**చిక్కడపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త:** అన్నా, చెల్లెళ్ళ అనుబంధం అప్యాయతలకు నిదర్శనం రక్షా బంధన్ అని గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్ అన్నారు. శనివారం బిజెపి రాష్ట్ర మైనారిటీ మోర్చ నాయకుడు మొహమ్మద్ మహమూద్, ఓబీసీ మోర్చ అసెంబ్లీ కన్వీనర్ ఎం.ఉమేష్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్ కుమార్ మరియు ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ జయ్ రామ్ రెడ్డిలకు కార్పొరేటర్ రాఖి కట్టారు. నీవు నాకు రక్షా...నేను నీకు రక్షా...మనం దేశానికి రక్షా.! అందుకు ఈ రాఖీ నిదర్శనం అని కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బీజేపీ నాయకులు నర్సింహ, ఆనంద్ రావు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

**రామ్‌నగర్ పూర్వ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో..**
రక్షాబంధన్ వేడుకలు సనాతన ధర్మానికి, హిందూ సంప్రదాయానికి ప్రతీకలుగా నిలుస్తాయని రామ్‌నగర్ మాజీ కార్పొరేటర్, బిఆర్ఎస్ రాష్ట్ర నేత వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం రాఖీపౌర్ణమి సందర్భంగా వి.శ్రీనివాస్‌రెడ్డి అక్కాచెల్లెలు టి.శైలజారెడ్డి, నాయిని శిల్పారెడ్డి కట్టారు. మాజీ హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి కుమారుడు నాయిని దేవేందర్‌రెడ్డికి వి.సమతారెడ్డికి, అదే విధంగా నాయిని సాత్విక్‌రెడ్డికి నాయిని సాన్వీరెడ్డి రాఖీ కట్టారు.

**ఎమ్మెల్యే ముఠాగోపాల్ రాఖీ కట్టిన బ్రహ్మకుమారిస్**
రక్షాబంధన్ ప్రేమను ప్రతిబింబించే పండుగ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. సోదరుడు, సోదరి మధ్య ఉన్న బంధం గురించి చెప్పేది రాఖీ పండుగ అని అన్నారు. శనివారం బ్రహ్మకుమారిస్ చిక్కడపల్లి శాఖ ప్రతినిధి జయశ్రీ తదితరులు ఎమ్మెల్యే ముఠా గోపాల్, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేష్ లకు రాఖీ కట్టారు. అదేవిధంగా ముఠా నరేష్ జన్మదిన సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యేతో పాటు, బ్రహ్మకుమారిస్ ప్రతినిధులుశుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారిరి ప్రతినిధులు రశ్మిత, ప్రసాద్ రావు, బిఆర్ఎస్ నాయకుడు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

**జర్నలిస్ట్ కాలనీలో**
**నిజాంపేట్, ఆగస్టు 9, ప్రభాతవార్త :** రాఖీ పౌర్ణమి సందర్భంగా, నేను నీకు రక్ష, నీవు నాకు రక్ష, మనమందరం దేశానికి, ధర్మానికి, మన సంస్కృతికి రక్ష అంటూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు జర్నలిస్ట్ కాలనీలోని పత్రికా విలేకరులకు రక్షా బంధనం కట్టారు. బలి చక్రవర్తికి లక్ష్మీదేవి, ఇంద్రునికి శచీదేవి రక్షా బంధనం కట్టడం మొదలుకొని ఈనాటి వరకూ అవిచ్ఛిన్నంగా సాగుతున్న ఈ రక్షా బంధన ఉత్సవం మనకు తెలియజెప్పే కర్తవ్యం, ధర్మ రక్షణలోనే నా రక్షణ కూడా ఉన్నది. సహోదరులమైన భారతీయులందరము సంఘటితమై మన సంస్కృతిని, మన దేశాన్ని రక్షించుకుంటూ తద్వారా ప్రపంచశాంతికి పాటుపడాలని ఈ సందర్భంగా స్వయంసేవకులు పేర్కొన్నారు. తమకు రాఖీ కట్టిన స్వయంసేవకులకు విలేకరులు రక్షా బంధనం కట్టి దేశ, ధర్మ రక్షణ కోసం ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో ముక్కర్లలాలయ్య, నవీన్, ఏటూరి రఘు, కొలెపాక వెంకట్, శ్రీనివాస్, కృష్ణ, ఒర్సు లింగస్వామి, ప్రసాద్, డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, ఫణిధర్, తదితరులు పాల్గొన్నారు.

## గండిపేట మండలంలో వైభవంగా "రాఖీ" వేడుకలు



గండిపేట మండలం ఖానాపూర్ గ్రామంలో "నీవు నాకు రక్షా-నేను నీకు రక్షా" మనమిద్దరం దేశానికి రక్షా అంటూ రాకీలు కట్టుకుంటున్న యువకుల దృశ్యం



నార్సింగిలో కాంగ్రెస్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్‌కు రాఖీలు కడుతున్న స్థానిక మహిళలు



గంధంగూడలోని ఓ ఇంట్లో సోదరులకు రాఖీలు కడుతున్న సోదరీమణులు

**నార్సింగి, ఆగస్టు 9 ప్రభాతవార్త :**
గండిపేట మండలంలో సనాతన ధర్మంలో ప్రత్యేక స్థానం ఉన్న "రాఖీ" వేడుకలు వైభవంగా జరిగాయి. అన్నా-చెల్లెళ్లు, అక్కా-తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచిన రాఖీ వేడుకలలో ఆడపడుచులు తమ పుట్టింట్లో సందడి చేశారు. ఏడాదికోమారు తమ తోబుట్టువులను కలుసుకునేలా చేసే ఏకైక పండుగ రాఖీ పండగ. అన్ని గ్రామాలలోని ప్రధాన కూడళ్లు, కిరాణాషాపులు అన్నీ రంగు రంగుల రాఖీలతో నిండిపోయాయి. ఈ రాఖీలను కొనేందుకు ఆడపడుచులు ఎగబడ్డారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నిత్య శాఖల్లో సైతం స్వయం సేవకులు రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శాఖా ప్రాంగణాల్లో యువకులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని "నీవు నాకు రక్షా-నేను నీకు రక్షా" మనమిద్దరం దేశానికి రక్షా అంటూ నినాదాలు చేశారు. ఖానాపూర్‌లోని నిత్య శాఖ ప్రాంగాణమంతా యువకుల కేరింతలతో పండగ వాతావరణంను తలపించింది. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, స్వయం సేవక్‌లు తలారి రాములు ముదిరాజ్, దుద్దాల రాజు కురుమ, మన్నె సురేష్ ముదిరాజ్ తదితరులు ఈ రాఖీ వేడుకల్లో పాల్గొని యువకులలో ఉత్సాహంను నింపారు. నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు క్యాతం అశోక్ యాదవ్ నివాసగృహంలో ఆడపడుచులు అశోక్ యాదవ్‌కు రాఖీలు కట్టేందుకు ఎగబడ్డారు. అలాగే గంధంగూడలో కాంగ్రెస్ నాయకుడు హరీష్‌గౌడ్ ఇంట్లో సోదరులందరికి సోదరీమణులు రాఖీలు కట్టి మురిసిపోయారు. ఇలా అన్ని గ్రామాల్లో, అన్ని కుటుంబాల్లో రాఖీ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి.

## గిరిజనుల హక్కుల సాధనకై ఐక్యంగా పోరాడుదాం

### గిరిజన ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు వివేక్ వినాయక్



ప్రపంచ ఆదివాసీ దినోత్స వేడుకలు

**ముషీరాబాద్, ఆగస్ట్ 9, ప్రభాతవార్త:** గిరిజనుల హక్కుల సాధనకై ఐక్యంగా పోరాడుదామని గిరిజన ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు వివేక్ వినాయక్ పిలుపునిచ్చారు. శనివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ట్యాంక్‌బండ్‌పై నున్న కొమరం భీం విగ్రహం వద్ద ఆదివాసీయులు గిరిజన వేశధారణలతో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై వివేక్ నాయక్ మాట్లాడుతూ ఆదివాసీయుల సమగ్ర అభివృద్ధి కోసం ఆదివాసి బందు అమలుచేయాలని డిమాండ్ చేశారు. కొమరం భీంకు భారతరత్న ప్రకటించాలని, ఆదిలాబాద్‌లో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గిరిజన ఐక్య వేదిక గౌరవ అధ్యక్షులు హెచ్.కే. నాగు, ప్రధాన కార్యదర్శి సోయం ప్రభాకర్, ట్రెజరర్ సోయం గోవర్ధన్, జాయింట్ సెక్రటరీ యాదగిరి, కుమరం నరసింగరావు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



**అత్తాపూర్ ఆగస్టు9,ప్రభాతవార్త :**
భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు ఈనెల 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో నిర్వహించనున్న సందర్భంగా శనివారం రాజేంద్ర నగర్ మండల కేంద్రంలో మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను ముఖ్యఅతిథిలుగా సిపిఐ తెలంగాణ రాష్ట్ర కంట్రోల్ కమిషనర్ సభ్యుడు పుస్తకాల నర్సింగ్ రావు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కన్యగారి నర్సింహ్మారెడ్డిలు హాజరై పార్టీ నాయకులతో కలిసి గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహాసభకు రాజేంద్ర నగర్ మండలం నుండి పార్టీ శ్రేణులు కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.ఏ. రియాజ్ సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జే ఆనంద్ గౌడ్ మండల సహాయ కార్యదర్శిలు జె విజయానంద్ గౌడ్ ఎండి షఫీ ఎర్రబోడు కార్యదర్శి పాండు లక్ష్మీగూడ కార్యదర్శి జే సదానంద గౌడ్ ఆఫీస్ కార్యదర్శి సత్యం భారత జాతీయ మహిళా సమైక్య రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి మరియు జిల్లా ఉపాధ్యక్షురాలు కన్యగారి లక్ష్మీ మహిళా సమైక్య సభ్యులు రేష్మ అభిబ సిపిఐ రాజేంద్ర మండల కౌన్సిల్ సభ్యులు సయ్యద్ కాజా సాబీర్ కృష్ణ నాగార్జున చారి రామచంద్రయ్య బండి నరసింహ ఖలీల్ ఉడంగడ్డ కార్యదర్శి హుస్సేన్ భాయ్ మధు గాంధీనగర్ నుంచి ఎల్లయ్య మల్లేష్ పాల్గొన్నారు

# ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు

**చిక్కడపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త:**
చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక పవిత్రోత్సవాలు శనివారం వైదిక కార్యక్రమాలతో శాస్త్రోక్తంగా ముగిసాయి. వెంకటేశ్వర స్వామికి ఎంతో ప్రీతిపాత్రమైన పవిత్రోత్సవాలు ముదు రోజుల పాటు వివిధ రకాల ఆధ్యాత్మిక, పాంచారాత్రాగమ శాస్త్రోక్తంగా వేదపండితులు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపుచేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. మొదటిరోజు పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు. ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. మూడు రోజుల పాటు జరిగే పవిత్రోత్సవాలు మంగళవారం ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. వేదమంత్రాల సాక్షిగా.. శ్రీవారు అమ్మవారితో కలిసి పవిత్రోత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు భక్తిశ్రద్ధలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారిని పవిత్ర మండపంలోని యాగశాలకు వేంచేపుచేశారు. అక్కడ హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం వేడుకగా స్నపన



పవిత్రోత్సవాల సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణలు

తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుంగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచసూక్తాలను పఠించారు. ఆ తర్వాత పవిత్ర ప్రతిష్ట జరిగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు విశేష సమర్పణ చేశారు. అనంతరం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారికి విశేష పూజలు నిర్వహించారు.

అనంతరం యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు పవిత్ర ఆహ్వానం, స్వస్తివచనం, రక్ష బంధనం, ఋత్వికరణము, అగ్ని ప్రతిష్ఠ, హవనం, వేద ప్రబంధ పారాయణము, ఆరగింపు, మంత్రంపుష్పం, భక్తులకు తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు

వార్త, హైదరాబాద్ ఆదివారం 10, ఆగస్టు 2025


బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వంజరి వినోద్ కుమార్‌కు రాఖీ కడుతున్న సోదరీమణులు


ఎంపీ ఈటెల రాజేందర్ కు మీర్పేట్ డివిజన్ బిజెపి అధ్యక్షులు విశ్వకర్మ సంఘం నాయకులు మునుగంటి రామ్ ప్రదీప్ కుమార్తె మునిగంటి స్లోకనందిని రాఖీ కడుతున్న దృశ్యం



రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావులను కలిసి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం


రక్ష బంధన్ సందర్భంగా సోదరి డాక్టర్ సరిత బోడుప్పల్ నగర మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,తోటకూర శ్రవణ్ యాదవ్‌లకు రాఖీ కట్టారు.


రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డికి సోదరీమణులు మమత రెడ్డి,రూప రెడ్డి రాఖీ కడుతున్న దృశ్యం


సోదర భావానికి ప్రతీక అయిన రక్ష బంధన్ రాఖీ పౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని మాజీ మేయర్ బండ కార్తిక చంద్రా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.


రాఖీపౌర్ణమి సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా సోదరీమణులు సోమ నాగరాణి, కసనగొట్టు మంజుల ఆయనకు రాఖీ కడుతున్న దృశ్యం


రాఖీ పండుగ వేడుకలు జరుపుకుంటున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్


రాఖీ పండుగ సందర్భంగా సామ నర్సింహాగౌడ్‌కు రాఖీ కడుతున్న శ్వేత తదితరులు


ఎంపి ఈటెలకు రాఖీ కడుతున్న మహిళలు: చిత్రంలో మాజీ కార్పొరేటర్ బిక్షపతిచారి తదితరులు


రక్షా బంధన్ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డికి రాఖీ కడుతున్న మంత్రి సీతక్క

# ఘనంగా రక్షా బంధన్ వేడుకలు

## సోదర భావానికి ప్రతీక రక్షాబంధన్

### ఇంచార్జ్ ఎస్‌జిఎస్ చిలక నర్సింహారెడ్డి


ఇంచార్జ్ ఎస్ జి ఎస్ చిలక నరసింహారెడ్డికి రాఖీ కడుతున్న మార్కెట్ కమిటీ మహిళా ఉద్యోగస్తులు పుష్ప, మాధురి తదితరులు

**మలక్ పేట ,ఆగస్టు 9, ప్రభాతవార్త:**
సోదర భావానికి ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఫుల్ అడిషనల్ చార్జ్ ఉన్నత శ్రేణి కార్యదర్శి చిలక నరసింహారెడ్డి పేర్కొన్నారు. మలక్ పేట్ మహబూబ్ మాన్షన్ మార్కెట్ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్ 3 కార్యదర్శి పుష్ప, సిబ్బంది మాధురి ప్రియాంక తదితరులు ఇన్చార్జ్ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నరసింహారెడ్డికి కట్టి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిలక నరసింహారెడ్డి మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి పూజలు



**మల్కాజిగిరి ఆగస్టు9,ప్రభాతవార్త :**
ఆనంద్ బాగ్ చౌరస్తాలో నిర్వహించిన లక్ష్మీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని, అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి భక్తి, సత్సంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ నగర్ కార్పొరేటర్ మేకల సునీత, రాము యాదవ్, మల్కాజ్గిరి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు హేమంత్ పటేల్, చిన్న యాదవ్, నవీన్ యాదవ్, సురేష్, రాజశేఖర్, శ్రీధర్ వాసు ఇతర నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దుర్గా నగర్ దొడ్లబస్తీలో కార్పొరేటర్ పర్యటన



**మల్కాజిగిరి ఆగస్టు9,ప్రభాతవార్త :**
ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని దుర్గా నగర్ దొడ్లబస్తీలో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ స్థానికుల పిలుపుమేరకు ముంపు ఏరియాలలో పర్యటించారు.ఈ సందర్భంగా స్థానికులు రోడ్లు, డ్రైనేజీ, సమస్య పరిష్కరించాలని కోరారు. వర్షం వచ్చినప్పుడు తీవ్ర ఇబ్బందులు అవు తున్నాయని తగిన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ రజనీకాంత్ డివిజన్ ప్రెసిడెంట్ సత్యమూర్తి, బాబు, బ్రహ్మయ్య, మోసిన్, అశోక్, రత్న భూషణరావు, కాలనీ అధ్యక్షుడు నరసింహారెడ్డి చారి జాలయ్య రామకృష్ణ, రాము, శ్రీనివాస్,

## ఘనంగా పోచమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ఠాతన

**మేడిపల్లి ఆగస్టు 8 ప్రభాతవార్త ;**
పీర్జాదిగూడ కార్పొరేషన్ పర్వతాపూర్‌లో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్న పునఃప్రతిష్ఠా మహోత్సవాలు, ప్రముఖ వేదపండితులు నరేష్ శర్మ నేతృత్వంలోని వేదపండితుల బృందం ఆధ్వర్యంలో వేదమంత్రాల ఘోష మధ్య, శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి , మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి,మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్లు జక్క వెంకట్ రెడ్డి , అమర్ సింగ్,బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,మాజీ గ్రంధాలయ చైర్మన్ దర్గా దయాకర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్లు బొడిగె స్వాతి కృష్ణ గౌడ్ ,బైటింటి శారద ఈశ్వర్ రెడ్డి ,బండారి మంజుల రవీందర్ , పప్పుల రాజేశ్వరి అంజిరెడ్డి , మాజీ కోఆప్షన్ సభ్యులు చిలుముల జగదీశ్వర్ రెడ్డి , నాయకులు జైహింద్ గౌడ్ , చిలుముల శంకర్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు,మేడిపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ చైర్మన్ కావడపు రామ్ రెడ్డి, పోచమ్మ టెంపుల్ కమిటీ సభ్యులు, పర్వతాపూర్ కాలనీవాసులు,పాల్గొన్నారు.


వనస్థలిపురం డివిజన్ పరిధిలోని శ్రీ వెంకటరమణ కాలనీ (పడమర) నూతన కార్యవర్గం ఎన్నుకోబడిన సందర్భంగా కాలనీ అధ్యక్షుడు రవీంద్రనాథ్, కాలనీ ప్రతినిధులు సుధాకర్ రెడ్డి,రాములు నాయక్,రాములు,జగదీశ్వర్ రెడ్డి,కరుణాకర్ రెడ్డి లు బి.జె.పి.సీనియర్ నాయకుడు నూతి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి వెంకటేష్ లతో కలిసి మల్కాజిగిరి పార్లమెంటు సభ్యుడు ఈటెల రాజేందర్ ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఆ సందర్భంగా కాలనీ అభివృద్ధి కి సహకరించాలని కోరారు.(ప్రభాతవార్త.. వనస్థలిపురం.).

## 11న జరిగే తెలంగాణ పెన్షనర్ల మహాధర్నాకు కదలి రావాలి : లక్మయ్య

**వనస్థలిపురం. ఆగస్టు. 9.ప్రభాతవార్త :**
సమస్యల సాధనకై తెలంగాణ పెన్షనర్లు ఈ నెల 11న ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ఛలో హైదరాబాద్ మహాధర్నాలో అన్ని జిల్లాల నుండి అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొని తమ సత్తా చాటాలని టి. జి.పి. జెఏసి చైర్మన్ లక్మయ్య, మహిళా పెన్షనర్ల అసోసియేషన్ చైర్ పర్సన్ ఆర్.ఉమాదేవి లు పిలుపునిచ్చారు. వనస్థలిపురం లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మనం కొరితెచ్చుకున్న తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పట్ల నిర్లక్ష్యం, నిరాదరణ వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఎన్నో ఆశలు చూపి, హామీలిచ్చి,తమ మానిపిస్టోలో చేర్చి,ప్రభుత్వం ఏర్పాటైన 15 రోజుల్లో ఈ.ఎచ్.ఎస్.స్కీం పూర్తి చేసి ప్రకటిస్తామని, 10రోజుల్లో మూడు డి.ఏ. లు బకాయిలతో సహా ఏక మొత్తం లో చెల్లిస్తామని, ఆరు నెలల్లో మంచి ఫిట్మెంట్ తో పి.ఆర్.సి.ప్రకటిస్తామని హామీలిచ్చి,అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు.సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు మంత్రులు,


సమావేశంలో మాట్లాడుతున్న వివిధ పెన్షనర్ల సంఘాల నాయకులు.

అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేదన్నారు. పెన్షనర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, సమస్యలు చర్చించి,పరిష్కరించాలని కోరినప్పటికీ, తమకు పది నిమిషాలు సమయం ఇవ్వడానికి కూడా మంత్రులు ఇష్టపడడం లేదన్నారు.అడిగి,అడిగి, తిరిగి,తిరిగి మంత్రులు అందుబాటులో లేక,క్యాబినెట్ సబ్ కమిటీలో పెన్షనర్ల సమస్యలు చర్చకు రాక,విసిగి వేసారి చివరగా మనగోడు వినిపించేందుకు ఆందోళన కు దిగక తప్పడంలేదన్నారు .ప్రతి జిల్లా నుండి అధిక సంఖ్యలో మహాధర్నా కు తరలిరావలన్నారు.

## సోదరునికి రాఖీ కట్టిన సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:**
అక్క చెల్లెళ్లు – అన్నదమ్ముల మధ్య ఉండే ప్రేమానురాగాలు, ఆప్యాయ అభిమానాలకు ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ వేడుకలు శ్రావణ శనివారం ఘనంగా జరిగాయి. పవిత్ర శ్రావణ మాసంలో వచ్చే ఈ సాంప్రదాయ రక్షా బంధన్ పండుగను సోదర, సోదరీల కుటుంబాల్లో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. అనునిత్యం ప్రజా సేవలో, రాజకీయాల్లో బిజీగా గడిపే తెలంగాణ రాష్ట్ర మొట్టమొదటి మహిళా మంత్రి, మాజీ విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం శాసన సభ్యురాలు తన ఏకైక సోదరునికి రాఖీ కట్టి పండగ సాంప్రదాయాన్ని చాటారు. బంజారాహిల్స్‌లో నివాసం ఉంటున్న తన తమ్ముడు నర్సింహారెడ్డి (బాబు) నివాసానికి వచ్చిన ఆమె రాఖీ కట్టి మిఠాయి తినిపించి అనురాగాన్ని చాటారు. అదే విధంగా బాబు తన సోదరికి పాదాభివందనం చేసి ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రతి రోజూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, పార్టీ ప్రోగ్రామ్‌లలో తీరిక లేకుండా ఉంటున్న ఆమె శనివారం మాత్రం తన సోదరుని ఇంట్లో కొద్ది సేపు కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపడం విశేషం.


సోదరుడు నర్సింహారెడ్డి (బాబు)కు రాఖీ కడుతున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

## గాయత్రీ సేవా సంఘం ఆధ్వర్యంలో జంధ్యాల పౌర్ణమి పూజలు


జంధ్యాల పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్న గాయత్రీ సేవా సంఘం సభ్యులు

**సరూర్‌నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని శ్రీ గాయత్రీ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం శ్రావణ మాసం పవిత్ర జంధ్యాల / పౌర్ణమిని పురస్కరించుకొని సామూహిక నూతన యజ్ఞోపవీత ధారణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, యజ్ఞోపవీత ధారణ, దేవ రుషి పితృ తర్పణాలు, నూతన వటువులకు ఉపాకర్మ/ముంజి విడుపు, కాండ రుషి హోమాది తదితర కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో జరిపారు. అనంతరం మహిళలు శ్రావణ మాస కుంకుమార్చన నిర్వహించారు. శివసాయినగర్ శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఈ కార్యక్రమాల్లో గాయత్రీ సేవా సంఘం, లక్ష్మీ గణపతి దేవాలయం, కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, వివిధ కాలనీల మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడలో భక్తిశ్రద్ధలతో మార్కండేయ పూజలు


మార్కండేయ పూజలో పాల్గొన్న పద్మశాలి సంఘం నాయకులు

**సరూర్‌నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలో శనివారం పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మార్కండేయ పూజను ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన పూజ అనంతరం పద్మశాలి సంఘం నాయకులు జంజనాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం గౌరవాధ్యక్షుడు గుడ్డేటి కిష్టయ్య, అధ్యక్షుడు పాలాది రాందాస్, ప్రధాన కార్యదర్శి వనం రమేష్, కోశాధికారి మెకం కృష్ణ, కార్యనిర్వహణ అధ్యక్షుడు కుకుదాల యాదగిరిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## మయూరి వాహనంపై సంతోషిమాత దర్శనం


మయూరి వాహన సంతోషిమాత దర్శనంలో పాల్గొన్న నిర్వాహకులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** శ్రీసంతోషిమాత జన్మదినోత్సవం, రాఖీపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దిల్‌సుఖ్ నగర్‌లోని శ్రీసీతారామాంజనేయ స్వామి, శ్రీసంతోషిమాత దేవస్థానంలో రాఖీపౌర్ణమి సందర్భంగా శ్రీసంతోషిమాత అమ్మవారి జన్మదిన వేడుకలు వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంతోషిమాత జన్మదినోత్సవం సందర్భంగా అమ్మవారికి పలురకాల పుష్పాలతో అలంకరణ చేశారు. మయూరి వాహనంపై అమ్మవారి దర్శనం భక్తులను ఆకట్టుకుంది. గోక్షిర సహస్ర శంఖాభిషేకం, ధ్వజారోహణం, దోలారోహణం, మహామంగళహారతి, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయం ప్రధాన అర్చకుడు హరిమహారాజ్ పౌరోహిత్యంలో జరిగిన కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌యాదవ్, ప్రధానకార్యదర్శి రమేష్, కోశాధికారి గుడిశెట్టి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## రాజగోపురంకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సబిత


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:**
ఆర్కేపురం డివిజన్ సౌభాగ్యపురంకాలనిలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో రాజగోపురం పనులకు శనివారం మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుండి వచ్చిన వేద పండితులు శ్రావణమాసం పౌర్ణమి విశేషాన్ని వివరించి, సబితమ్మకు వేద ఆశీర్వచనం చేసి దీవించారు. తదుపరి స్వామివారి దర్శనం చేసుకొని రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నాయకులు గొడుగు శ్రీనివాస్, జగిని రమేష్‌గుప్తా, ఇంటూరి అంకిరెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, పెంబర్తి శ్రీనివాస్, శ్రీనివాస్, రామ్‌నరసింహగౌడ్, శంకర్‌నాయక్, రిషి, కాలనీ సభ్యులు నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, పరుశురాం, సుధాకర్‌గుప్త, మూర్తి పాల్గొన్నారు.

## పోలీసులకు అండగా నిలుస్తాం


సైదులును సన్మానిస్తున్న షరీఫ్

**ఎల్.బి.నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** శాంతిభద్రతల విషయంలో పోలీసులకు తాము అండగా నిలుస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎండి.షరీఫ్ పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్ నూతన ఇన్స్పెక్టర్ సైదులు బాధ్యతలు చేపట్టడంతో షరీఫ్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకుండా పోలీసులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాంగిర్‌బాబాగౌడ్, రాముగౌడ్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం


సుదర్శన హోమం నిర్వహిస్తున్న రమణచక్రవర్తులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:**
చైతన్యపురి డివిషన్ ఫణిగిరికాలనీలో శ్రావణమాస పౌర్ణమి శ్రవణ నక్షత్రం సందర్భంగా గురుమాతాశ్రీ దివ్య రమణ చక్రవర్తుల ప్రత్యక్ష పర్యవేక్షణలో సుదర్శన హోమం, హయగ్రీవహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యకు, జ్ఞాన ప్రదాతగా పూజలందుకునే హయగ్రీవస్వామిని ఆరాధిస్తే జ్ఞానానికి లోటుండదన్నారు. శ్రీలక్ష్మీనారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా దివ్యచక్రా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం, పుస్తకాల పంపిణీ చేసి గోసేవాలో పాల్గొన్నారు. సేవా సమితి డైరెక్టర్ వెంకటరమణచారి, గోపిదేశీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆదిలక్ష్మిసమేతశ్రీమన్నారాయణస్వామి నవకలశ స్థాపన


ధ్వజస్తంభం ఏర్పాటు చేస్తున్న పండితులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీలో అష్టలక్ష్మి దేవాలయంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా చతురస్థానార్చన నిత్య ఆహ్వానములు ప్రారంభించి నూతన ధ్వజస్తంభ యంత్ర పునప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా ఆదిలక్ష్మిసమేత శ్రీమన్నారాయణస్వామి వారి నవకలశ స్థాపన, హయగ్రీవ జయంతి వేడుకలు, సామూహిక వరలక్ష్మి వ్రతాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆదిలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామిని దర్శించుకోవడానికి స్థానికులతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

### ఎన్టీఆర్ నగర్‌లో ఆదివాసి దినోత్సవ వేడుకలు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 9 ప్రభాతవార్త:** ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ గిరిజన హక్కుల దినోత్సవాలు ఘనంగా నిర్వహించామని గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.గోపినాయక్ తెలిపారు. ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ బంజారాకాలనీలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసి గిరిజన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదివాసీ గిరిజన తెగలు తమ హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలని 1994లో ఐక్యరాజ్య సమితి తీర్మానించిందన్నారు. భారత రాజ్యాంగంలో ఆదివాసీ గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలు గతంలో ఎనడు లేని విధంగా ప్రమాదంలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే.అవ్యజానాయక్, జే.మోహన్‌నాయక్, నందునాయక్, యస్.బాధ్యనాయక్, యస్.రవినాయక్, జే.రవితేజనాయక్, కే.హిభినాయక్ పాల్గొన్నారు.